


## రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయాలి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు



అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, తదితరులు

జగిత్యాల, డిసెంబర్ 6: రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు కోరారు. పట్టణంలోని తహసీల్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి ఆయనతో పాటు జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ రావు మాట్లాడుతూ, అంబేద్కర్ రాసిన రాజ్యాంగంతోనే పేద, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని పేర్కొన్నారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ హైదరాబాద్‌లో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిశోర్, నక్క గంగాధర్, తుమ్మ గంగాధర్, వొల్లెం మల్లేశం, అయిల్నేని ఆనంద్ రావు, శీలం ప్రియాంక, సాగి సత్యం రావు, సన్నిత్ రావు, తేలు రాజు, భగవాన్, ప్రతాప్, రహమాన్, శ్రీనివాస్, గంగారెడ్డి, సాయి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సర్వే వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలి



రాయికల్: సర్వే పత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

మల్లాపూర్/రాయికల్/మెట్‌పల్లి రూరల్, డిసెంబర్ 6: సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో పకడ్బందీగా నమోదు చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మల్లాపూర్, రాయికల్, మెట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయాల్లో సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను శుక్రవారం ఆయన పర్యవేక్షించారు. ఆయా చోట్ల కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా గ్రామాల వారీగా కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేయడంతో పాటు ప్రజలు సర్వేలో ఇచ్చిన వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో సమగ్రంగా నమోదు చేయాలని ఆదేశించారు. సర్వే వివరాల ఆన్‌లైన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఆర్డీవోలు శ్రీనివాస్, మధు, తహసీల్దార్లు వీర్‌సింగ్, ఎండీ ఖయ్యూమ్, శ్రీనివాస్, ఎంపీడీవోలు జగదీష్, చిరంజీవి, వొదెల రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

పెగడపల్లి, డిసెంబర్ 6: మండల కేంద్రంలోని కస్తూర్బాలో అకౌంటెంట్ పోస్టు భర్తీకి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి సులోచన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో కామర్స్, కంప్యూటర్ సర్టిఫికెట్ ఉన్న వారు లేదా బీకాం కంప్యూటర్స్ విద్యార్హత ఉన్న వారు ఈనెల 12లోగా మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



కార్యక్రమానికి హాజరైన జిల్లాలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు



సైన్స్ ప్రదర్శనను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి

## సైన్స్ ఫలాలు పేదలకు అందేలా ఉండాలి

- ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి

జగిత్యాల టౌన్, డిసెంబర్ 6: సైన్స్ ఫలాలు పేదలకు అందేలా ప్రాజెక్టులను తయారు చేయాలని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని ఓల్డ్ హైస్కూల్‌లో శుక్రవారం బాల వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. కాగా, రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన విభాగంలో 7 థీమ్స్‌కు సంబంధించిన 214 ప్రదర్శనలు, ఇన్‌స్పైర్ అవార్డ్ మానక్‌కు సంబంధించిన 65 ప్రదర్శనలు జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు తీసుకువచ్చి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు మీ కుటుంబ పరిస్థితులను అర్థం చేసుకొని, మీ కుటుంబానికి, సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలన్నారు. సైన్స్ ఫలాలు పేదలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి-లక్ష్మణ్ మాట్లాడుతూ, ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. జిల్లా విద్యాధికారి రాము మాట్లాడుతూ, జగిత్యాల జిల్లాను అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో నిలుపాలని కోరారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వారిని ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్ మాట్లాడుతూ, శాస్త్రీయ పరిజ్ఞానం, శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు గుట్రాజ్‌పల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థినులు పర్యావరణ హితాన్ని తెలుపుతూ చేసిన నృత్యం ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ పర్యవేక్షకుడు సురేందర్, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

## టీఎన్జీవో నూతన కార్యవర్గం

జగిత్యాల టౌన్, డిసెంబర్ 6: హైదరాబాద్‌లోని నాంపల్లి కేంద్ర సంఘ కార్యాలయంలో టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేన్ సమక్షంలో శుక్రవారం సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎన్జీవో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మిర్యాల నాగేందర్‌రెడ్డి, కార్యదర్శిగా అమరేందర్‌రెడ్డి, సహాధ్యక్షుడిగా ఎండీ మహమూద్ ఎన్నికయ్యారు. అనంతరం టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడిగా పని చేసి తహసీల్దార్‌గా ఉద్యోగోన్నతి పొందిన బోగ శశిధర్‌ను రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల సమక్షంలో శాలువాతో సత్కరించారు. కేంద్ర సంఘం సహాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సత్యనారాయణగౌడ్, నాయకులు సాహిద్‌బాబు, రవిచంద్ర, రవీందర్, ఉమాపతి, రాజేందర్, రాములు, శ్రీనివాస్‌స్వామి, కుమారస్వామి, సంపత్, భువనేశ్వర్, ప్రమోద్‌కుమార్, వెంకట్‌పవన్, సునీత, హరిప్రసాద్, శ్రావణి, ఇంద్రజ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ గొప్ప దార్శనికుడు



అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

మెట్‌పల్లి, డిసెంబర్ 6: అంబేద్కర్ గొప్ప దార్శనికుడని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద 125 అడుగుల ఎత్తైన అంబేద్కర్ విగ్రహానికి వర్ధంతి సందర్భంగా నివాళులర్పించేందుకు వెళ్లనివ్వకుండా పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడంతో తన స్వగృహంలోనే అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి దిశా, నిర్దేశం చేస్తూ రాజ్యాంగాన్ని రూపొందించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తూ ప్రశ్నించే గొంతుకలపై దాడి చేస్తున్నదని విమర్శించారు. అలాగే, మెట్‌పల్లి పట్టణంలోని పార్క్‌లో అంబేద్కర్ విగ్రహానికి, ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి అంబేద్కర్ సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## అఖిల భారత యాదవ సంఘ నాయకుల సమావేశం



నినాదాలు చేస్తున్న అఖిల భారత యాదవ మహాసభ సంఘం నాయకులు

మల్లాపూర్, డిసెంబర్ 6: మండల కేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో శుక్రవారం అఖిల భారత యాదవ మహాసభ సంఘం నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దనరేకుల సంతోష్‌యాదవ్ మాట్లాడుతూ, సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని అఖిల భారత యాదవ మహాసభ సంఘం నుంచి తొలగించినట్లు తెలిపారు. అలాగే, నూతన జిల్లా కార్యదర్శిగా బండారి వెంకటేశ్, మండల ప్రధాన కార్యదర్శిగా ఎట్టెం మల్లేశ్ యాదవ్, మండల ఉపాధ్యక్షుడిగా పంచతి చిన్నమల్లయ్య, కార్యదర్శిగా అర్కల గంగారెడ్డిని నియమించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు గంగారాజం, ఉపాధ్యక్షుడు సతీశ్, గౌరవాధ్యక్షుడు రాజగంగారం, నాయకులు అశోక్, మహేందర్, సందీప్, నర్సయ్య, గంగమల్లయ్య, హరీశ్, శ్రీనివాస్, రాజేందర్, నాగరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## అంకిత భావంతో పని చేస్తేనే గుర్తింపు

సారంగాపూర్, డిసెంబర్ 6: ఉద్యోగులు విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేస్తేనే ప్రజల్లో గుర్తింపు వస్తుందని సబ్ పోస్ట్ మాస్టర్ బ్రహ్మచారి పేర్కొన్నారు. అర్పల్లి బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ ఎండబెట్ల మాణిక్యం ఉద్యోగ విరమణ పొందగా శుక్రవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్యం దంపతులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సొల్లు సురేందర్, తపాలా ఉద్యోగులు కార్తీక్, శ్రీనివాస రెడ్డి, చంద్రారెడ్డి, యూనియన్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, విజేందర్ రావు, హేమెందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి




ఎస్ఐకి ఫిర్యాదు పత్రం ఇస్తున్న వెలమ సంక్షేమ మండలి సభ్యులు

జగిత్యాల కలెక్టరేట్/జగిత్యాల రూరల్, డిసెంబర్ 6: వెలమ సామాజిక వర్గాన్ని దూషించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపెల్లి శంకర్‌పై చర్యలు తీసుకోవాలని వెలమ సంక్షేమ మండలి సభ్యులు శుక్రవారం జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇక్కడ వెలమ సంక్షేమ మండలి ప్రతినిధులు ఐల్నేని సాగర్‌రావు, వేణుగోపాల్ రావు, కృష్ణారావు, పురుషోత్తంరావు, శ్రావణ్‌రావు, ప్రవీణ్‌రావు, అజిత్‌రావు, తదితరులున్నారు.

## తాళం వేసిన ఇండ్లల్లో చోరీ

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 6: మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన సుదవేని సుమలత గురువారం సాయంత్రం మెట్‌పల్లిలోని తాను అద్దెకు ఉంటున్న ఇంటికి వెళ్లింది. శుక్రవారం ఉదయం ఇంటికి వేసిన తాళం పగులగొట్టి తలుపులు తెరిచి ఉండడంతో సుమలత అత్తమ్మ గుర్తించి సమాచారం అందించింది. దీంతో మెట్‌పల్లి నుంచి డబ్బా గ్రామానికి తిరిగి వచ్చి చూసే సరికి ఇంట్లో వస్తువులు చిందరవందరంగా పడి ఉన్నాయి. బీరువాలో భద్రపరిచిన పది గ్రాముల బంగారు ఆభరణాలు గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు సుమలత స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. అలాగే, రాసూరి గంగాధర్ ఇంట్లో బీరువా పగులగొట్టి రూ.5 వేల నగదు ఎత్తుకెళ్లారని, జరుపుల కిష్టయ్య ఇంటి తాళాలు పగులగొట్టారని బాధితులు పోలీసులు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకొని క్లూస్ టీంతో ఆధారాలు సేకరించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు.

## లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో తొగుట పీఠాధిపతి పూజలు



ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న తొగుట పీఠాధిపతి

ధర్మపురి, డిసెంబర్ 6: ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామిని శుక్రవారం తొగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ దర్శించుకొని, పూజలు చేశారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు దేవస్థానం సిబ్బంది, పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో స్వామివారలను దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆశీర్వచన మండపంలో పండితులు స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదం అందజేసి సన్మానించారు.